నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మహబూబ్‌నగర్

శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

సీఎం సోదరుడికి సన్మానం



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి గురువారం మధ్యాహ్నం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి , మహబూబ్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జీ. మధుసూదన్ రెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ పి వెంకటేష్ , డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ తదితరులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్‌లు , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఆత్మకూర్ : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు బ్రహ్మరెడ్డి ప్రజా వైద్యశాల ఆసుపత్రి డాక్టర్ ముజీబ్ రహిమాన్ ఆధ్వర్యంలో స్థానిక మస్జిదే నూరులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ అలీమ్ రాశాది ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ముజీబ్ రహిమాన్, డాక్టర్ ముబాశ్శిర్ రెహమాన్ నవీద్, మోసిన్, అశ్రఫ్, హనీఫ్ జియావుర్ రహిమాన్, తౌఫిక్ ఇమ్రాన్ వాహిద్ రజక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి

- స్వీప్ నోడల్ అధికారి



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కళాశాలలో గురువారం "పోస్టర్ మేకింగ్" పోటీ నిర్వహించారు. డైట్ కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్య పరచడానికి జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి. స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో "ఓటు" చాలా విలువైనదని, ప్రతీ ఓటరు ఓటింగ్‌లో పాల్గొనేలా ఛాత్రోపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. పోస్టర్ల ద్వారా ప్రజల్లో ఆసక్తికర అంశాలను వెలుగులోకి తీసుకు రావచ్చని అన్నారు. రాబోయె పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమంలో భాగంగా "స్వీప్" ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు పేర్కొన్నారు. 18ఏళ్ల దాటిన ప్రతీ ఒక్కరూ కొత్త ఓటరుగా నమోదు కోసం కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు రూపొందించిన చార్ట్‌లను, పోస్టర్లను ఒక్కొక్కటిగా పరిశీలించి వారిలోని కళా ప్రతిభను కొనియాడారు. ఓటు హక్కు...ప్రజల హక్కు, ఓటేసే బాధ్యత....మనందరి బాధ్యత, ఓటరు చైతన్యం ప్రజాస్వామ్య ప్రభంజనం అనే సందేశాత్మక చిత్రాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహమ్మద్ మెహరాజుల్లా ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ డా. షేక్ లియాక్ అలీ, సూపరింటెండెంట్ రామకృష్ణావు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దేశం మొత్తం కాంగ్రెస్ గాలి వీస్తోంది

- హనీఫ్ అహ్మద్

నవ తెలంగాణ - మహబూబ్ నగర్



దేశం మొత్తం ఇప్పుడు కాంగ్రెస్ గాలి వీస్తుందని, తప్పుడు ప్రచారాలు చేస్తూ బీజేపీ పబ్బం గడుపుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత హనీఫ్ అహ్మద్ ఆరోపించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధిక ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచింది కాక ఇప్పుడు కాకమ్మ కథలు చెబుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల అమలు దిశగా పయనిస్తుందని తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణమ్మ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పైన ఈ రోజు అనుచిత వ్యాఖ్యలు చేశారని, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారని వాటిని తీవ్రంగా ఖండించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదప్రజల కోసం ప్రజాపాలన తీసుకు వచ్చిందని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు. ఓట్ల కోసం పదవుల కోసం పేద ప్రజల బలహీనతలను వాడుకోరాదని డీకే అరుణకు హితవు పలికారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రిసిటీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అలాగే రూ. 500 రూపాయలకే సిలిండర్ అమలు కాలేదని, ఎన్నికల అనంతరం యధావిధిగా పేద ప్రజలకు ఈ పథకాలు అమలవుతాయన్నారు. రాహుల్ గాంధీ 2024 లో తప్పకుండా ప్రధానమంత్రి అవుతారని, మోడీ హామీలను భారత దేశ ప్రజలు మర్చిపోలేదని రూ.15 లక్షలు జన్ ధన్ పథకం ద్వారా ఇస్తానన్న హామీ ఏమైందని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ పోయాయని ఆయన గుర్తు చేశారు. గత పది సంవత్సరాలుగా మహబూబ్ నగర్ డీకే అరుణ ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు.

ఫీజులు తగ్గించాలి

- నిరుద్యోగ సంఘం

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టెట్టు ఫీజులు వెంటనే తగ్గించాలని నిరుద్యోగ పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రమేష్ సాగర్ , జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, షరీఫ్, అజయ్‌లు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగ యువత డీఎస్సీ టెట్ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వము విడుదల చేయడం స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో టెట్ పేపర్ వన్ దరఖాస్తు ఫీజు రూ.200 రెండు పేపర్లకు 300 ఉండేదని, ప్రస్తుతం టెట్ ఫీజు పేపర్ వన్ దరఖాస్తు వెయ్యి, రెండు పేపర్లకు గాను రూ. 2000లకు పెంచడంతో నిరుద్యోగులకు భారంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అధిక ఫీజులు తగ్గించి పాత ఫీజులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ ప్రశాంతం

- ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 99.86 పోలింగ్
- నారాయణపేట, నాగర్ కర్నూల్‌లో ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాప్రతినిధులు
- ఓటింగ్ సరళి బట్టి గెలుస్తామని దీమా వ్యక్తం చేస్తున్న ఇరువర్గాలు

నవ తెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

స్థానిక ప్రజాప్రతినిధుల కోటాలో ఖాళీ ఏర్పడిన ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంకాలం 4గంటల వరకు జరిగిన పోలింగ్లో 99.86 శాతం స్థానిక ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయి.10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ,కౌన్సిలర్లు ,ఎక్స్ అఫీషియో మెంబర్లు మొత్తం 1439 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1435 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ , నారాయణపేట జిల్లాలో ఇద్దరు మాత్రమే అనువర్య కారణాల వలన తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. మహబూబ్‌నగర్లో 245 వనపర్తిలో 218, గద్వాలలో 225 , కొల్లాపూర్‌లో 67, అచ్చంపేటలో 79, కల్వకుర్తిలో 72 , షాదనగర్ 171 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగర్ కర్నూల్‌లో 171 కి 100 మంది నారాయణపేటలో 205 మందికి 204 మంది ఓటు హక్కను వినియోగించుకున్నారు. 14మంది ఎమ్మెల్యేలు ఆరు మంది ఎమ్మెల్సీలు ఇద్దరు ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే , మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకున్న దామోదర్ రెడ్డి , ఎమ్మెల్యేలు ఎం శ్రీనివాస్ రెడ్డి ,రాజేష్ రెడ్డి , వీర్లపల్లి శంకర్ తదితరులు ఓటుహక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లో..

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన ఓటును కొడంగల్ పోలింగ్ బూత్‌లో వినియోగించుకున్నారు.ముందుగానే పోలింగ్ సమాచారం తెలుసుకున్న పోలీసులు ముఖ్యమంత్రి రాకతో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తాడన్న దీమా వ్యక్తం చేశారు.

ఎవరి దీమా.. వారిదే..

1439 ఓట్లలో 1000 మందికి పైగా బీఆర్ఎస్ కు చెందిన వారు ఉన్నారు. అయితే 2023 డిసెంబర్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. తక్కువ స్థానిక



ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి నిలబెట్టి కాంగ్రెస్ పార్టీ ఆశలు పెంచుకుంది. ఆత్మ ప్రబోధానుసారం ఓట్లు వేస్తే గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార పార్టీ బలంతో బెదిరించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడితే కాంగ్రెస్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.





ఎమ్మెల్సీ ఎన్నికల్లో ..

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ విజయం ఖాయం

నవ తెలంగాణ - మహబూబ్ నగర్


స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు ను వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీటీ సీలను కనీసం మనుషులుగా కూడా గౌరవిం చలేదని, వారు ప్రజలచేత ఎన్నుకున్న నాయకులు అన్న విషయాన్ని కూడా గుర్తించలేని స్థితిలో వారు ఇన్నాళ్లు ఉన్నారని అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సభలో స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు. స్థానిక సంస్థలను పటిష్టంగా తయారు చేసినప్పుడే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని, స్థానిక సంస్థల బలోపేతానికి కృతనిశ్చయంతో ఉన్నాం అని మహబూబ్ నగర్ బహిరంగ సభలో స్పష్టం చేసినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎంపీటీసీలు కేవలం ప్రజల చేత ఎన్నుకోబడిన వారిగా మాత్రమే గుర్తింపు ఉందని, వారు ప్రజలకు ఏ విధమైన సంక్షేమ ఫలాలు అందించలేని దుర్లభమైన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎంపీటీసీల ఆత్మ గౌరవం పెంపొందించే విధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఇప్పుడు స్వేచ్ఛను కోరుకుంటున్నారని, అందుకే మేము ప్రజాస్వామ్య పద్ధతిలో



మా అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించాం అని, రాష్ట్ర ఎంపీటీసీ అధ్యక్షుడు సైతం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడిన తర్వాత , ఎంపీటీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని వారికి ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాతో వారు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వేసిన నామినేషన్ను ఉపసం హంరణ చేసుకున్నారన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మంది ఎమ్మెల్యేలం ఎవరం క్యాంపు రాజకీయాలు చేయ లేదని, ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో ఉన్నామని, దేశంలో చక్రం తిప్పుతామని, కాబోయే ముఖ్యమంత్రి అంటూ ప్రచారాలు నిర్వహించుకున్న కల్వకుంట్ల వారసుడు ఇప్పుడు కేవలం ఒక్క ఎమ్మెల్సీ సీటు కోసం దిగజారుడు రాజకీయాలకు చేస్తూ గోవాలో ఎంపీటీసీ సభ్యులతో కలిసి జల్సాలు చేస్తున్నారని, అక్కడ ప్రవర్తన చూసి జుగుప్సాకరంగా ఉందని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ ఎంత ప్రయత్నించినా ఫలితం తమ వైపే ఉందని 80 శాతం ఎంపీ టీసీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న ట్లు స్పష్టం చేశారు. వ్యాపారులను, రాజకీయ నాయ కులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం ధ్వంసం చేసి నిస్సిగ్గుగా అధికార దుర్విని యోగానికి పాల్పడ్డారని , పోలీసు వ్యవస్థను సైతం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛ ను కోరుకుంటున్నారని, స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రె స్‌కు అండగా ఎంపీటీసీలు నిలుస్తున్నారన్నారు. ఆయన వెంబడి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ ఉన్నారు.

జాతీయ సదస్సులో..


బీ. ఆర్. ఆర్ విద్యార్థులు



జడ్చర్ల : స్థానిక డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యానభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్దిపేట లో జరుగుతున్న రెండు రోజుల జీవవైవిధ్య పరిరక్షణ లో ఇటీవలి పోకడలు అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. సదాశివయ్య ప్రత్యేక అతిథిగా హాజరయి జీవవైవిధ్య పరిరక్షణ లో మార్గదర్శక హీరోలు అనే అంశంపై తన ప్రసంగం చేశారు. ఇదే సదస్సు లో కళాశాలలో %ఎ.ఓ.ష% తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ "డా. బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కర్బన స్వాంగీకరణ అనే అంశంపై తన వ్యాసాన్ని విశదీకరించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న చెట్లు ఎంత కార్బన్ డై ఆక్సైడ్ ను తీసుకుంటున్నాయో అనే పరిశోధన ను ఇతర విద్యార్థులతో కలసి డా. సదాశివయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేశాడు. తన పరిశోధనా ఫలితాలను ఈ సదస్సులో తెలియజేశాడు. ఇందుకు గాను ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఈ సదస్సులో కళాశాల నుండి పరిశోధక విద్యార్థి రమాదేవి, బీజెడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిరాం లు పాల్గొన్నారు. జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి సాధించిన రాహుల్ ను కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియ చిన్నమ్మ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం అభినందించారు.

పాలమూరులో బీజేపీ సీన్ రివర్స్

- శాసనసభ ఎన్నికల తర్వాత ఢీలా
- పార్టీ నుంచి కీలక నాయకుల రాజీనామా
- టికెట్టు రాకపోతే ఆశావహులు పార్టీకి దూరం..
- పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మరింత బలహీనం
- త్రిముఖ పోటీలో మూడో స్థానానికి... రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కే అనుకూలమంటున్న విశ్లేషకులు



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది ప్రధాన రాజకీయ పార్టీల్లో కలవరం మొదలయ్యింది. ముఖ్యంగా కేంద్రంలో మూడో సారి అధికారంలోకి రావడానికి బీజేపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ... మొదటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి అవకాశం ఇవ్వలేదన్న కారణంలో మాజీ ఎంపీ ఏపీ జితెందర్‌రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పాలమూరు మోడీ అని ప్రచారంలో ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన బండారు శాంతికుమార్ మహబూబ్‌నగర్ పార్లమెంటు టికెట్ ఆశించి భంగపడ్డారు. అతను సైతం ఈసారి బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు ప్రచారం చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇక నాగర్‌క ర్నూల్ లోనూ... అదే పరిస్థితి నెలకొంది. మొదటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం బంగారు శృతి వంటి వారిని కాదని షెడ్యూల్ వెలువడే సమయంలో బీజేపీలో చేరిన ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు పోతుగంటి భరత్ ప్రసాద్‌కు అవకాశం ఇవ్వడం స్థానిక బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ గెలుపు ఏమోకాని మూడో స్థానానికి పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. రెండింటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు అభ్యర్థులను ప్రకటించారు. మహబూబ్‌నగర్ పార్లమెంటు బరిలో కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి తాజా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ బరిలో దిగనున్నారు. నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ మల్లు రవి, బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నుంచి పోతుగంటి భరత్ ప్రసాద్ పోటీలో ఉన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుస్తో ందన్న దీమాతో నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానికంగా పరిస్థితులు పరిశీలిస్తే... బీజేపీకి ప్రతికూలంగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పార్లమెంటు పరిధిలో ఏడు శాసన సభ నియోజకవర్గాలు ఉన్నాయి. మొన్న జరిగిన ఎన్నికల్లో ఏడుకు ఏడు కాంగ్రెస్ కైవసం చేసుకొంది. ఇక్కడ బీజేపీ మూడో స్థానానికి పడిపోయింది. మొన్నటి ఎన్నికలో కాంగ్రెస్‌కు ఏడు స్థానాల్లో కలిపి 6,11,514 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 5,11, 077 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 1,13,080 మాత్రమే పోలయ్యాయి. నాగర్‌కర్నూల్‌లోనూ... ఇదే పరిస్థితి ఉంది. కాంగ్రెస్‌కు 6,39,628 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 500654 ఓట్లు, బీజేపీకి 1,18,513 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కూడా మూడో స్థానానికే పరిమితమైంది.

ప్రజలకు దూరంగా బీజేపీ..

బీజేపీ ఎంత ప్రచారం చేసినా ఉమ్మడి జిల్లాలో మూడో స్థానానికే పరిమితం అవుతోందని విశ్లేషకుల అంచనా.. మహబూబ్‌నగర్‌లో బీజేపీకి గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ఏడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. ముఖ్యంగా బీజేపీలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎంపీ జితెందర్‌రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. రెడ్డీ సామాజిక వర్గం జితెందర్‌రెడ్డి వెంట నడిచే అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆదినుంచి బీజేపీకి వ్యతిరేకంగానే ఉంటారు. బీసీ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వలేదన్న కారణంతో బీసీలు సైతం ఈ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా ఓటేస్తారని తెలుస్తోంది. ఇక నాగర్‌కర్నూల్‌లోనూ... బీజేపీకి అనుకూల వాతావరణం ఏమీ లేదు. భరత్‌ప్రసాద్‌కు టికెట్టు ఇవ్వడం పట్ల ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా దళితులు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో బీజేపీకి వ్యతిరేక వాతావరణం ఉంది. రెండింటిలోనూ కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉండొచ్చనేది విశ్లేషకుల అంచనా.

ఎమ్మెల్సీ ఓటు వేసిన పలువురు ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు గురువారం వనపర్తి పట్టణంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటింగ్ నందు ఓటును వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారిలో జడ్పీటీసీ శివరంజని, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కోటేశ్వర్ , మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, వైస్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య పోషన్న, రామకృష్ణ, అశ్విని కుమార్, మహేశ్వరి , విజయలక్ష్మి, యాదమ్మ, తబ్సుం మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



నవతెలంగాణ - ఆత్మకూరు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులకు బుధవారం రాత్రి స్థానిక మసీదు నూర్ లో స్టార్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ అలీమ్ రషీద్ ప్రపంచ శాంతి కొరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేశంలోని ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమంలో సాక్షి రఫీ, ఆటోమొబైల్ ఇస్మాయిల్, మీసేవ ఫెరోజ్, కరెంటు ఇస్మాయిల్, సాదిక్ , మక్బుల్, నవీద్ద్ , మొసిన్ ,ముస్లిం పెద్దలు, దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిలో వందశాతం పోలింగ్



నవతెలంగాణ - వనపర్తి

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు 100 శాతం పోలింగ్ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డిఓ కార్యాలయంలో 14 మండలాలకు సంబంధించి జరుగుతున్న ఓటింగ్ లో 100 శాతం పూర్తి అయింది. ఇందులో మహిళా ఓటర్లు 119 మంది, పురుష ఓటర్లు 99 మంది మొత్తం 218 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన నాల్గో నెంబర్ పోలింగ్ బూత్ లో వనపర్తి ఎమ్మెల్యే చూడు మేఘారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులందరూ ఒక్కొక్కరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిలో భాగంగా ఉదయం 10 గంటలకు 31 మంది ఓటర్లు తమ ఓటును వేయడంతో 14.22 శాతం పోలింగ్ నమోదయింది. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు భారీ స్థాయిలో ఓటర్లైన ప్రజాప్రతినిధులు పోలింగ్ కేంద్రానికి చేరుకొని 150 మంది ఓటు వేయడంతో 68.8 శాతం ఓటింగ్ నమోదయింది. అలాగే మధ్యాహ్నా 2గంటల లోపు 212 మంది ఓటర్లు ఓటు వేయడంతో 97.24 శాతం ఓటింగ్ నమోదయింది. సాయంత్రం నాలుగు గంటల వరకు 218 మంది ఓటర్లకు గాను 218 మంది ఓటు వేయడంతో 100 శాతం పోలింగ్ పూర్తయింది.





వివాహ వేడుకకు హాజరైన మాజీ సర్పంచ్

నవతెలంగాణ - మదనాపురం

మదనాపురం మండలంలోని అజ్జకొలు గ్రామ మాజీ సర్పంచ్ వాకిట సత్యం గురువారం నాడు ఆత్మకూర్ మండలం సింగంపేట గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, రాములు గౌడ్ కుమారుడు బాల మురళి వివాహ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వదూవరుడు సౌజన్య బాలమురళిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో అజ్జకొలు నాయకులు రాములు గౌడ్, కృష్ణయ్య, వెంకటన్న. తదితరులు ఉన్నారు.

తెలంగాణ రికగ్నైజెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ - పెబ్బేరు

టిఆర్ఎస్ఎంఎ పెబ్బేరు శ్రీరంగాపురం మండలాల నూతన కమిటీ ఏకగ్రీవంగా గురువారం ఎన్నికైనట్లు కమిటీ అధ్యక్షులు రాఘవేందర్ తెలిపారు. అధ్యక్షులుగా రాఘవేందర్, అడ్వైజర్‌గా బీంసాగర్, జనరల్ సెక్రెటరీగా జైన్ జోసెఫ్, ట్రెజరీగా కే.పవన్, వైస్ ప్రెసిడెంట్‌గా జయకృష్ణ, బాలయ్య జైంట్ సెక్రటరీలుగా కాసిం, బుచ్చన్నలు ఎన్నికయ్యారు. కమిటీ ఎన్నికలలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలు పలువురు నాయకులు



నవతెలంగాణ - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ నందు గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి పంపు శ్రీనివాసులు కుమారుడు వంశీ వివాహ వేడుకలకు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇట్టి కార్యక్రమంలో ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆర్.పరమేష్, మైనార్టీ అధ్యక్షులు హుస్సేన్ మియ, పట్టణ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్టిడి శ్రీను, వడ్డే వెంకటన్న, పెద్ద హుస్సేన్, విష్ణు, టాకి ఆంజనేయులు, పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో ఉండాలి

- కార్యదర్శులకు ఎంపీడీఓ చెన్నమ్మ సూచన



నవతెలంగాణ -మదనాపురం

గ్రామాలలోని ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఎంపీడీఓ చెన్నమ్మ తెలిపారు. మండలంలోని అజ్జకోలు, రామన్ పాడ్ గ్రామాలలో గురువారం నాడు స్థానిక అధికారులకు పలు అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ట్యాక్స్ కలెక్షన్స్, ఆన్‌లైన్ నమోదు వివరాలను సక్రమంగా చేయాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్ ప్రక్రియ సరిగ్గా ఉండేటట్లు చూస్తూ, వీది లైట్లతో పాటు అన్ని వసతులపై ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రజల నుండి పిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పుష్ప, కాంగ్రెస్ నాయకులు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు :

ఆత్మకూరు బార్ అసోసియేషన్ 2024-25, కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ అక్కల నారాయణ గౌడ్, వైస్ ప్రెసిడెంట్1 జీకే రాములు, వైస్ ప్రెసిడెంట్2 ఏపీ రాజేందర్, జనరల్ సెక్రెటరీ డి.అశోక్ కుమార్, జనరల్ సెక్రటరీ కె.ముక్తేశ్వర్, ట్రెజరర్ ఏం.అశోక్ కుమార్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ఎం.గంగా ధర్ గౌడ్, ఎల్.శ్రీనివాస్ రెడ్డి, వై.విజయ భాస్కర్ రెడ్డి, అబ్రహం, అడ్వైజరీ కమిటీ మెంబర్స్, తిప్పారెడ్డి, సి.రామేశ్వర్ రెడ్డిలను ఎన్నుకోవడం జరిగింది.

పెండింగ్ వేతనాలపై కార్మికుల ఆందోళన

- పెండింగ్ వేతనాలకై ఏప్రిల్ ఒకటి నుండి ఆస్పత్రి కార్మికుల నిరవధిక సమ్మె
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో దగా పడుకున్న దవఖాన కార్మికులు
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్
- 7 నెలల పెండింగ్ వేతనాలపై ఆత్మకూర్ సీహెచ్‌సీ ఎదుట కార్మికుల ఆందోళన
- ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరి నారాయణకి సమ్మె నోటీస్
- కార్మికుల ఆందోళనకు ఐఎన్ టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాస్ మద్దతు



నవతెలంగాణ - ఆత్మకూరు.

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు వేతనాలు అందించడంలో ప్రభుత్వం, వైద్యశాఖ అధికారుల తీవ్రమైన నిర్లక్ష్యంతో దవాఖాన కార్మికులు దగా పడుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మండిపడ్డారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికుల ఏడు నెలల పెండింగ్ వేతనాల చెల్లింపుల్లో అలసత్వం నిరసిస్తూ ఆత్మకూర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ హరినారాయణకి ఏప్రిల్ ఒకటి నుండి నిర్వహించబోయే ఆస్పత్రి కార్మికుల నిరవధిక సమ్మె డిమాండ్ నోటీసును అందచేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ అత్యవసర విభాగమైన ప్రభుత్వ వైద్యరంగంలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్, కార్మికులు అరకొర చెల్లించే వేతనాలకు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం బాధాకరమన్నారు. టీవీవీపీ పరిధిలోని జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలలోని పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలలుగా వేతన బడ్జెట్ విడుదల కాలేదని దీనితో ఏజెన్సీ కాంట్రాక్టర్లు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా చేతులెత్తేసి కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా పరిధిలోని ఆత్మకూర్, ఖిల్లా ఘనపూర్, రేవల్లి, పీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల సంబంధిత వెంకటయ్య ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికుల వేతనాల్లో పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో కూడా భారీ అవినీతికి పాల్పడుతున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కార్మికుల జీవనం సాగేది ఎలా అని ప్రశ్నించారు.

ఈనెల 31 వరకు కార్మికుల కు రావాల్సిన ఏడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించక పోతే ఏప్రిల్ ఒకటి నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రి కార్మికుల నిరవధిక సమ్మె దిగుతున్నామని అందుకు సంబం ధించి తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కి డిమాండ్ నోటీసులు అందజేశామని ప్రభుత్వం మానవత దృక్పథంతో ప్రత్యేక చొరవ చూపి కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ఆందోళనలకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ నేత భరత్‌లు, మిషన్ భగీరథ వర్కర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షులు ఎం.రఘు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు సత్తార్, మోహినోద్దిన్, శ్రీకాంత్, అరుణ్, నాగమ్మ, పార్వతమ్మ, బాలకిష్టమ్మ, తిరుపతమ్మ, చెన్నమ్మ, శైలజా, మన్నెమ్మ, బాలకిష్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - వనపర్తి

వనపర్తి జిల్లా న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు అయిందని ఎన్నికల అధికారులు జి.ఉత్తరయ్య, ఎం.రఘు, కె.ప్రవీణ్ కుమార్‌ను గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు కోసం న్యాయవాదుల సంఘం కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీలో పలు పోస్టులకు నామినేషన్ వృద్ధాప్యజేసిన అభ్యర్థులను ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులుగా సి.మోహన్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాలనాగయ్య, మహిళా ప్రతినిధిగా ఎం.శ్రీదేవి ఎన్నికల్లో గెలిచారని వారు పేర్కొన్నారు.

అలాగే ఉపాధ్యక్ష పదవికి పోటీ లేకపోవడంతో డి.కృష్ణయ్య, జె.బ్రహ్మయ్య చారి, సహాయ కార్యదర్శిగా పి.శంకర్, కోశాధికారిగా ఎం.ఆంజనేయులు, క్రీడల అధికారిగా ఎన్.రాందూళి, గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.కృష్ణయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎన్.రాజు, రియాజ్ అహ్మద్, ఎన్.త్రినాథ్, ఎస్. తిరుపతయ్య, డి.వేదవ్యాస్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం ఉంటుందని వారు పేర్కొన్నారు.

వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



నవ తెలంగాణ-చిన్నంబావి

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వివాహ వేడుకల్లో కాంగ్రెస్ మాజీ మార్కెట్ చైర్మన్ రామచంద్రారెడ్డి, ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కృష్ణప్రసాద్ యాదవ్ లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన మీనిగే సరోజమ్మ ఆహ్వానం మేరకు వారి కుమారుడు నవీన్ నాయుడు, లిఖిత మనోజ్ఞతో వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గూడెం గోవిందు యాదవ్ ఆహ్వానం మేరకు వారి అన్న కుమారుడు జనార్ధన్, సుమలత నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల భాస్కర్ యాదవ్, ఈశ్వరి నాయుడు, పాటీ మీది నీలయ్య, మీనిగే నాగేష్ నాయుడు, ఇటిక్యాల శేఖర్ యాదవ్, ముష్టి శేఖర్ యాదవ్, ముష్టి కృష్ణయ్య, కాంగ్రెస్ యువ నాయకుడు మీనిగే బాలకృష్ణ నాయుడు, వెంకటేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వివాహాలకు ఎన్ఆర్ఐ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొత్త కళ్యాణ్ కుమార్ వెల్టూరులో కృష్ణయ్య ఆహ్వానం మేరకు వారి కుమారుడు నవీన్ కుమార్ పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చిన్నమారుకు చెందిన వెంకటస్వామి ఆహ్వానం మేరకు వారి కుమారుడు గణేష్ వివాహానికి హాజరై నూతన వధూవరులను దీవించారు. మద్దిలేటి ఆహ్వానం మేరకు వారి కుమారుడు రామచంద్రుడు పెళ్లికి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించారు. గోపులాపురంకు చెందిన వెంకట నరసింహారెడ్డి ఆహ్వానం మేరకు రాజారెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. గూడెం గోవింద్ యాదవ్ ఆహ్వానం మేరకు వారికి అన్నకుమారుడు జనార్ధన్, సుమలత పెళ్లి, బెక్కెం నేలబిల్యు జుర్రు బాలస్వామి ఆహ్వానం జుర్రు తిరుమలేష్ వివాహానికి హాజరై నూతన వధూవరులను దీవించారు. అనంతరం చిన్నంబావి మండల కేంద్రంలో రవీందర్ గౌడ్ ఆహ్వానం మేరకు నూతన గృహ ప్రవేశానికి కొత్త కళ్యాణ్ కుమార్ హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్ , మండల నాయకులు మందడి చిదంబరం రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు గజ్జ ఈదన్న యాదవ్, ఆకుల వెంకటేష్, భోగం రమేష్, యూత్ లీడర్ ప్రకాష్ యాదవ్, శివ, మల్లయ్య, హనుమంతరావు, రాజు కుమార్, చుక్కా మహేష్ రావు, రామస్వామి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - చిన్నంబావి

మండల పరిధిలో వివిధ గ్రామాలలో వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ బిచుపల్లి యాదవ్, చిన్నంబావి సర్పంచ్ పసుపుల రంజిత్ కుమార్ మండల పరిధిలో కొప్పునూరు గ్రామానికి చెందిన మురుగల భాగ్యమ్మ శ్రీనివాసులు ఆహ్వానం మేరకు కుమారుడు నరసింహ, లాస్యల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొందిపర్ల గోవిందు యాదవ్ ఆహ్వానం మేరకు అన్న కుమారుడు జనార్ధన్ యాదవ్ లావణ్య ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పెద్దమారూర్ గ్రామానికి చెందిన మేకల రమాదేవి, మద్దిలేటి ఆహ్వానం మేరకు వారి కుమారుడు రామచంద్రుడు, మల్లికల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు .కొప్పునూరు గ్రామానికి చెందిన కంది మహేష్ యాదవ్ ఆహ్వానం మేరకు బెక్కెంలో వారి కూతురు రాణి, తిరుమలేష్‌ల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొప్పునూరుకు చెందిన మాదుగం సువర్ణ, సురేష్ దంపతుల ఆహ్వానం మేరకు చిన్నమార్‌లో జరిగిన వారి కూతురు దీపిక, గణేష్‌ల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. గోపాలపురంకు చెందిన తాడూరు వసంత, వెంకట నరసింహారెడ్డి ఆహ్వానం మేరకు వారి కుమారుడు రవి రాజారెడ్డి, సహస్రల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అయ్యవారిపల్లికి చెందిన మేకల లక్ష్మీదేవమ్మ, తిరుపతయ్యల ఆహ్వానం మేరకు వారి కుమారుడు బాలకృష్ణ, మమతల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంత్రి అనుచరులు జంగ బిచుపల్లి యాదవ్ పసుపుల రంజిత్ కుమార్ బడికెల బాలు యాదవ్, తేజారెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న, రామస్వామి, సునీల్ రెడ్డి, యుగంధర్ గౌడ్, నరేష్ యాదవ్, శంకర్ యాదవ్, వడ్డే సురేష్, జాల రమేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.



3

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నాగర్‌కర్నూల్

శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com



గేమ్యానాయక్ తండా విద్యార్థుల క్షేత్ర పర్యటన

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల పరిధిలోని గేమ్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అడవుల పరిశీలనకై అటవీశాఖ వారి 'నేచర్ స్టడీ క్యాంప్-ఫారెస్ట్ అవేర్ నెస్ ప్రోగ్రాం'లో మిళితమై సోమశిల ఎకో పార్క్‌ని సందర్శించారు. గైడ్‌గా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్యాంసుందర్ నూతనంగా నిర్మించిన "ఫారెస్ట్ వ్యూ పాయింట్" నుంచి ప్రకృతి అందాలని చూయిస్తూ గ్లోబల్ వార్మింగ్ భూతాన్ని అరికట్టాలంటే చెట్లు పెంచవలసిన అవసరాన్ని, ప్రకృతిలో మొక్కలు-జీవరాశుల పరస్పరాధారానుభూతాన్ని చక్కగా వివరించారు. ప్రకృతి వనరులని అవసరాలకే ఉపయోగించుకోవాలని, అత్యాశలకి కాదనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ చిన్నారులకి సందేశమిచ్చారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రామంజన్ గౌడ్, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అటవీ అధికారులతో మాట్లాడి సహకరించిన ఎస్ఎంసీ మాజీ చైర్మెన్ ముడావత్ తిరుపతి నాయక్, ఉపాధ్యాయులు సతీష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎంపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా గడ్డం విజయ్



నవతెలంగాణ-కందనూలు

బహుజన్ ముక్తి పార్టీ కార్యాలయం హైదరాబాద్‌లో లోక్‌సభ అభ్యర్థుల మొదటి జాబితా అభ్యర్థులను బీఎంపీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ ప్రకటించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుండి గడ్డం విజయ్‌ని ప్రకటించిన సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి గడ్డం విజయ్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మొదటి లిస్టులోనే తన పేరును ప్రకటించిన బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్‌కి, జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ధన్యావాదాలు తెలిపారు. పూలే, అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయ సాధనలో బహుజన రాజ్య సాధనకై దేశవ్యాప్తంగా భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్ మేశ్రామ్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ బీఎంపీ అని నాగర్‌కర్నూల్ ప్రజలు తనను ఆదరించి 'మంచం' గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో బహుజనుల గొంతుక వినిపిస్తానని తెలిపారు.

కళాకారులకు సన్మానం



నవ తెలంగాణ-కందనూలు

అంతరించిపోతున్న పౌరాణిక నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రేక్షకుల ఆదరణ ఎంతో అవసరమని జిల్లా నాటక సమాజాల సమైక్య అధ్యక్షులు పెబ్బేటి నిరంజన్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా కందనూలు కళాసేవా సమితి కార్యాలయంలో క్లాస్‌మెంట్ క్లబ్ వారు రంగస్థల కళాకారుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిరంజన్ మాట్లాడుతూ పౌరాణిక నాటకాలైన రామాంజనేయ యుద్ధం ద్వారా సత్య, ధర్మ పాలనను, కృష్ణార్జున యుద్ధం ద్వారా రాజనీతిని, సత్య హరిశ్చంద్రుని నాటకం ద్వారా సత్యం, ధర్మం యొక్క విలువలను సమాజానికి తెలుపుతాయని, మరెన్నో నాటకాలు ప్రజలకు నైతిక విలువలను, సందేశాలను అందిస్తాయన్నారు. కావున అటువంటి నాటక రంగం సమాజానికి ఎల్లప్పుడు అత్యంత ఆవశ్యకమన్నారు. క్లాస్‌మెంట్ క్లబ్ వారి సేవా తత్పరతను కొనియాడారు. అనంతరం రంగస్థలం కళాకారులు కందనూలు కళా సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు బి.నర్సింహారెడ్డి జి.మురళీధర్ రావు, ఆర్.సత్యం, కేశవాచారి, బాస వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, ఆకారపు రామ్మోహన్, బాబూమియా, పాండుచారి, సుదర్శనాచారి, విజయకాంత్, విష్ణుచారి, సుగుణచారి, తిరుపతయ్య, వెంకట్రావమ్మ, సౌభాగ్య, జయమ్మ, సునందనాచారి, రమణ పంతులు, బద్రీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లాస్‌మెంట్ క్లబ్ తరపున క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, కె.బాలరాజు, కిరణ్, శ్రీనువాసులు, సురేందర్ చారి పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ - ఉప్పునుంతల

ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కమిటి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తో పాటూ దేవస్థానం కమిటీ చైర్మన్ దేవస్థాన కమిటీ సీఈవో కమిటీ సభ్యులు, మండల ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న

నవతెలంగాణ-తాడూరు

ఉపాధి కూలీలకు కనీస వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. గురువరం తాడూరు మండలంలోని అల్లాపూర్, గోవిందయపల్లి గ్రామాల ఉపాధి హామీ కూలీలకు సమస్యలను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, కూలీలకు ప్రతి సంవత్సరం బడ్జెట్ తగ్గిస్తూ కూలీల పొట్టకొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పనిచేసే చోట మౌలిక వసతులు, మంచినీళ్ళ, చికిత్స బాక్స్, టెంట్ ఏర్పాటు ఉపాధి హామీ కూలీలకు గాయపడిన వారికి పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. కమ్యూనిస్టులు పోరాట ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కేంద్ర ప్రభుత్వం నీరుగాల్చడానికి చూస్తుంది. ఇప్పటికైనా కూలీల పట్ల చిన్నచూపు చూడడం సరైనది కాదని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూలీలకు రోజు వేతనం 600 ఇవ్వాలి వారం వారం బిల్లులు ఇవ్వాలి గడ్డపార నీటి కోసం బిల్లులు చెల్లించాలి. వేసవికాలంలో ఎండ ఎక్కువగా ఉండటం వలన కూలీలందరు కుట్టింట్లు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, బిక్షపతి, కుమార్, శ్రీశైలం, ఆంజనేయులు, శీను, నారాయణ, శివుడు, జానీ, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాజేందర్

నవతెలంగాణ- అచ్చంపేట

బార్ అసోసియేషన్ అచ్చంపేట అధ్యక్షులుగా రాజేందర్ న్యాయవాది ఎన్నికయ్యారు. గురువారం ఎన్నికల అధికారులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రామ్మోహన్, రాజేందర్లు పోటీలో ఉన్నారు. రామ్మోహన్‌కు 1ఓటు, రాజేందర్‌కు 21 ఓట్లు వచ్చాయి. దీంతో రాజేందర్ అధ్యక్షులుగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించా రు. ఉపాధ్యక్షులుగా జి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎండి కౌసర్, కల్చరల్ సెక్రటరీగా జి.మల్లేష్ ఎన్నికయ్యారు. రాజేందర్‌ను తోటి న్యాయవాదులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మస్తాన్,



రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకట్ శెట్టి, గుండె మల్లేష్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు

- కలెక్టర్ పి.ఉదయ్ కుమార్
- జిల్లాలో పోలింగ్ 99.69 శాతం

నవ తెలంగాణ- కందనూలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో గురువారం జరిగిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఉదయం 8గంటలకు ప్రారంభమై, సాయంత్రం 4గంటల వరకు అర్హులైన ప్రజా ప్రతినిధి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పోలింగ్ సమయం ముగిసే సమయానికి 319 ఓట్లకు గానూ 318 ఓట్లు పోలయ్యాయి. 99.69శాతం పోలింగ్ శాతం నమోదయిందని కలెక్టర్ తెలిపారు. కొల్లాపూర్ 6 నెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 67 మంది ఓట్ల గాను 67 ఓట్లు 100శాతం పోలయ్యాయి. నాగర్‌కర్నూల్ 7 నెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 101 ఓట్ల గాను 100 ఓట్లు 99.99శాతం పోలయ్యాయి. అచ్చంపేట 8 నెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 79 ఓటర్లకు గాను ఓట్లు 79తో 100శాతం పోలయ్యాయి. కల్వకుర్తి 9 నెంబర్ పోలింగ్ కేంద్రానికి సంబంధించిన 72 ఓటర్లకు గాను72 ఓట్లు 100శాతం పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల నుండి నేరుగా మహబూబ్‌నగర్ రిసీవింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్స్‌లను పటిష్ట భద్రత మధ్య తరలించనున్నట్లు తెలిపా



రు. ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్‌లో కౌంటింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుండి పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ కలెక్టరేట్ నుండి అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పోలింగ్ సరళిని 4 పోలింగ్ కేంద్రాల అధికారులతో ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.

అదనపు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సీతారామారావు, నాగర్‌కర్నూల్ జడ్పీ పాఠశాలలోని పోలిం గ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా కృషి చేసిన అధికార యంత్రాంగానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

కీటక జనిత వ్యాధులపై

ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలి

- అడిషనల్ డెరైక్టర్ డా.అమర్ సింగ్ నాయక్

నవతెలంగాణ- కందనూలు

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీటక జనిత వ్యాధులపై జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు మరియు సూపర్వైజరి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ డా. అమర్ సింగ్ హాజరైనారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కీటక జనిత వ్యాధులపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలని, వైద్య అధికారులకు పర్యవేక్షణా సిబ్బందికి సూచించారుదోమ కాటు వలన డేంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గునియా



లాంటి ఎన్నో వ్యాధులు ప్రబులుతున్నాయని, వాటిని నిర్మూలించేందుకు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ముఖ్యంగా దోమలు పుట్టకుండా చూడాలని, ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ, ఇంటి పరిసరాలలో నీటి నిల్వలేకుండా చూడాలని, వారానికి ఒక్కరోజు డ్రై పాటించాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దోమ తెరలు వాడే లా ప్రజలకు విస్తృతంగా అవగహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా కె సుధాకర్ లాల్ మాట్లాడుతూ.. కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వివరిస్తూ, అవసరమైన ప్రతి ఒక్కరికి మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయనీ ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారుఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.సుధాకర్ లాల్ , డిప్యూటి డైరెక్టర్ వెంకటేశ్, ఎంటమాలజిస్ట్ సైదులు, డిప్యూటి డి.ఎమ్.ఎచ్. ఓ. డా. వెంకట్ దాస్, డా. బీమా నాయక్, ప్రొగ్రాం అధికారులు డా. రవి కుమార్ నాయక్, జిల్లా మలేరియా అధికారి డా. తార సింగ్,డా. ప్రదీప్ ,అసిస్టెంట్ మలేరియా అధికారి అర్. శ్రీనివాసులు, జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు, పర్యవేక్షణా అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-కొల్లాపూర్

మహబూబ్‌నగర్ చెందిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మన్యం జీవన్ రెడ్డిదే గెలుపు ఎక్సైజ్ పర్యాటక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. గురువా





రం కొల్లాపూర్ పట్టణంలోని బాలికల కళాశాలలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఓటు వేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్థానిక వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. గ్రామాల్లో పనులు చేసిన ప్రజాప్రతినిధులకు తగిన బడ్జెట్ కేటాయించకపోవడంతో పాటు గౌరవ మర్యాదలు ఇవ్వకపోవడంతో అవినీతి దుర్మార్గం పరిపాలన కొనసాగిందన్నారు. 2014లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, కనీసం ప్రజాస్వామ్య పాలనలో ప్రగతిభవన్‌లో సెక్రటేరియట్ కాలు పెట్టనిచ్చేవారు కాదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. అందుకే పోయిన ఎలక్షన్లలో ప్రజలు గుణపాఠం చెప్పారని అదే తరహాలో నేడు ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో కూడా తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్లు వైస్ చైర్మన్ ఉన్నారు.

కందనూలు : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన శాసన మండలి ఉప ఎన్నికలకు ఓటు వేసి ఎమ్మెల్సీ కూచుకుల్లా దామోదర్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత కేసు నమోదు

నవతెలంగాణ-తెలకపల్లి

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది స్థానిక ఎస్సై బి నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన పులిరాజరత్ శివకుమార్ గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తన ట్రాక్టర్ నెంబర్ టీఎస్ 31 టీఏ 1858, ట్రాలీ నెంబర్ టీఎస్ 31 టి ఏ 1858 లో ఇసుకను తరలిస్తుండగా మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామం వద్ద పట్టుకుని ట్రాక్టర్ నిర్వాహకుడు శివకుమార్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం

- కేసు నమోదు

నవతెలంగాణ -బల్మూరు

మండల కేంద్రం బల్మూరుకు చెందిన బత్తుల వినోద్ అనే యువకునిపై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేసిన సంఘటనలో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. ఎందుకు సంబంధించిన వివరాల ప్రకారం బాధితుడు మండల కేంద్రంలో కిరాణం షాపు నిర్వహించుకోగా గత రాత్రి అచ్చంపేట నుండి కిరాణా సామాన్ తీసుకొని వస్తుండగా మండలంలోని మైలారం గేటు సమీపాన గుర్తు తెలియని వ్యక్తులు బైక్ను అడ్డగించి కత్తులతో దాడి చేయగా తప్పించుకొని తీవ్రగాయాల పాలు అయ్యానని తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అచ్చంపేట పట్టణంలో బాధితుని కులం వారే తనపై హత్యాయత్నం చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ఇందుకు ప్రేమ వ్యవహారమే అయ్యుంటుందని వారే తనపై దాడి చేసి ఉంటారని బాధితుడు తను ప్రేమించిన అమ్మాయి తల్లిదండ్రుల పై, కొందరు వ్యక్తుల పై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యా దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విష యమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్

కందనూలు : జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి ఒంటి గంటల సమయంలో పోలీసులు లేట్ నైట్ వెహికల్ చెకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వహనదారులు మద్యం సేవించి వహనాలు నడుపుతూ తమ ప్రాణాల కు బలైవుతున్నారని, ఇట్టి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇన్సూరెన్స్ లేని వహనాలు లైసెన్స్ లేని వహనదారు లకు పట్టుకొని వహనాలు సీజ్ చేస్తున్నారు. ఇంటి నుంచి బయటికి వెళ్లేట ప్పుడు లైసెన్స్ ఆర్‌సీ, ఇన్సూరెన్స్ సరైన వెహికల్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని వహనదారులకు పలు సూచించారు. ఎలాంటి డాక్యుమెంట్స్ లేని వారిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటా మని పోలీసులు తెలిపారు.



వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ



నవతెలంగాణ - ఉప్పునుంతల

ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన నారం శ్రీనివాస్ రెడ్డి కూతురు వివాహ వేడుకలలో డీసీసీ అధ్యక్షులు అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మండల అధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, ఎంపిపి తిప్పర్తి అరుణ నర్సింహా రెడ్డి, జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లి రమాబాయి తండ్రి అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ జయశంకర్

నవ తెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్రికల్ గ్రామానికి చెందిన కర్నే శిరీష అలియాస్ బర్రెలక్క సోషల్ మీడియాలో నెంబర్ వన్ స్థానంలో ఉంది. బర్రెలక్క వివాహం పీఎంఆర్ ఫంక్షన్ హాల్ పెద్దకొత్తపల్లి మండలంలో ఘనంగా జరిగింది. నాగర్‌కర్నూల్ ప్రాంత నలుమూలల నుండి బర్రెలక్క పెళ్లి చూడడానికి ఆసక్తిగా జనాలు వచ్చి పెళ్లిని ఆలకించారు.

అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ రెస్ట్ చైర్మన్ జయశంకర్, సభ్యులు వివాహానికి హాజరై నూతన దంపతులు శిరీష వెంకటేష్‌లను ఆశీర్వదించారు. అనంతరం పెళ్లికి బహుమతిని అందజేశారు.

ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ వీరి వివాహం తల్లి రమాబాయి బాబాసాహెబ్ అంబేద్కర్‌లా స్ఫూర్తితో ప్రతి ఒక్కరి పట్ల సేవాభావం కలిగి సమాజానికి మీ జంట ఆదర్శంగా నిలవాలన్నారు.



గద్వాలలో వందశాతం పోలింగ్

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి బీ.ఎం.సంతోష్ తెలిపారు. గురువారం గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎం.పీ డీ ఓ) లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 225 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో ఉదయం 10:00 గంటల వరకు 30.22 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12:00 గంటలకు 43.11 శాతం , 2:00 గంటలకు 93.33 శాతం, సాయంత్రం 4:00 గంటల వరకు 100 శాంతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోలింగ్ సరళిని జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు పరిశీలించారు.

వివాహ వేడుకల్లో .. ఎమ్మెల్యే



ఊట్కూర్ : మండలంలోని పగిడిమారి గ్రామంలో గురువారం జరిగిన వివాహ వేడుకల్లో మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విగ్నేశ్వర్ రెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి ఓబులాపూర్ వెంకటేష్ గౌడ్ నర్వ మండల కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య , సాగర్ ,అలీ ,అంజనే యులు తదితరులు పాల్గొన్నారు.








ప్రశాంతంగా పోలింగ్

నారాయణపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నారాయణపేటలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 205 ఓట్లకు గాను 204 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తెలిపారు. పురుష ఓటర్లు 89, మహిళా ఓటర్లు 115 ఉండగా పురుషులు మొత్తం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు ఒకరు మాత్రం తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. మొత్తం 99.51 శాతం ఓట్లు పోయినట్లు తెలిపారు. ఈ ఎన్నికలలో జెడ్పీ చైర్ పర్సన్ కే.వనజ అంజనేయులు గౌడ్, పేట శాసన సభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీలను జడ్పిటిసి లను ఏనాడు కూడా గౌరవించలేదని అహంకారంతో కాలం వెళ్లదీశారని అన్నారు. ఎంపీటీసీలను ప్రజల చేత ఎన్నుకోబడిన వారుగా మాత్రమే గుర్తింపు ఉందని, ప్రజలకు ఏ విధమైన సంక్షేమ ఫలాలు అందించాలని ఆలోచన గత ప్రభుత్వానికి రాలేదని అన్నారు. ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ బై ఎన్నికలలో గత ప్రభుత్వంలో గెలుపొందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛను కోరుకుంటారని , అలాంటి స్వేచ్ఛ గత ప్రభుత్వంలో వారికి కలగలేదని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేవలం ఎమ్మెల్సీ సీటు కోసం కౌన్సిలర్లను, జెడ్పీటీసీలను , ఎంపీటీసీలను గోవాకు తీసుకెళ్లి అక్కడ ఉంచారని దిగజారుడు రాజకీయాలు చేయడం సరైనది కాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో సక్రమమైన పద్ధతిలో ఎన్నికలు జరిగేటట్టు అందరికీ స్వేచ్ఛాయుత వాతావరణం లో ఓటును వినియోగించుకునేటట్లు చేయాలని అన్నారు. ఏది ఏమైన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రహదారిని ఆక్రమించిన వారిపై..
చర్యలు తీసుకోవాలని వినతి

- సర్వే నిర్వహిస్తాం : తహసీల్దార్



మరికల్ : మరికల్ మండల కేంద్రంలో సర్వేనెంబర్ 757 లో గల గతంలో అంతర్గత రహదారి ఉండెను ఇట్టి రహదారి ఆక్రమించుకొని దుకాణాలు నిర్మాణం చేసుకోవడం జరిగిందని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అంతర్గత రహదారి కి కట్టెలతో అడ్డుకట్ట వేయడంతో ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. రహదారికి అడ్డుకట్ట వేసిన వ్యక్తులపై నాలా అనుమతులు తీసుకొని అట్టి రహదారిపై దుకాణాల నిర్మాణం చేశారని, ఇట్టి విషయమై సర్వే నంబరు 757 కు సంబంధించిన కాగితాలు ఉన్నాయన్నారు. అట్టి స్థలం పై పరిశీలించి వాస్తవాలను తెలుసుకొని అట్టి దుకాణాలను నిర్మాణం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇట్టి రోడ్డుకు పనికి ఆహార పథకం కింద మొర్రం పని చేయడం జరిగిందని, ఇట్టి విషయంపై సర్వే అధికారులకు చెప్పి సర్వే చేయాలని కోరారు. లేనిచో నారాయణపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అట్టి రహదారిపై దుకాణాలు నిర్మాణం చేసి వారిపై చర్యలు తీసుకోవాలని లేని ఎడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మరికల్లో ఉన్న ధర్మన్న కుంట చెరువు పై పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం మరికల్ మండల తహసీల్దార్ సునీత కి సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ ఇట్టి విషయంపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా.. ప్రధాన రహదారి

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- ప్రతి నిత్యం భారీ వాహనాల రాకపోకలు
- ఏళ్ల తరబడి ఇదే తీరు..

ఉట్కూర్ : మక్తల్ నారాయణపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై కొల్లూరు గేట్ నుంచి ఉట్కూర్ చెక్ పోస్ట్ సమీపం వరకు.. అలాగే తిప్రాస్‌పల్లి గ్రామ సమీపం వరకు బీటీ రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డుపై కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపేట మక్తల్ రైయిచూర్ , గద్వాల్ , కర్నూల్ , యాదగిరి , గురుమిట్ కాల్ , సేడం , పరిగి , కొడంగల్, కోస్గి , మద్దూరు , దామరగిద్ద తదితర పట్టణాలకు నిత్యం వందలాది వాహనాలు తిరుగుతాయి. రోడ్డు గుంతల మయంగా మారడంతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ వాహనాలకు చెందిన బోల్ట్ ఊడిపోయే పరికరాలు పాడైపోయే ప్రమాదం లేకపోలేదని వాహనదారులు అందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనదారులు పలు ప్రమాదాలకు గురయ్యే అవకా శాలు లేకపోలేదని ప్రజలు ద్విచక్ర వాహనదారులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు . మరోపక్క ఈ రోడ్డుపై మొరం ఇసుక టిప్పర్లు అధిక లోడ్ (బరువు) వేసుకొని వెళ్లడంతో మరింత రోడ్డు పాడైపోయిందని మండల ప్రజలు పేర్కొం టున్నారు. రోడ్డు గుంతల మయంగా మారడంతో 108 వాహనంలో లేదా ప్రైవేట్ వాహనాల్లో అత్యవసర సమ యంలో పేషంట్లకు తీసుకుని వెళ్లాలన్న , సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగే సమావేశాలకు ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.





రోడ్డుపైనే దుమ్ము ..

గుంతల మయంగా మారిన రోడ్డుపై గతంలో మొర్రం వేయడంతో మొర్రం పోయి గుంతల మయంగా మారింది . గుంతల్లో ఉన్న మొర్రంతో భారీ వాహనాలు వెళ్లడంతో దుమ్ము లేస్తుంది. దీంతో వాహనాలు నడిపేటప్పుడు ఇబ్బందికరంగా మారిందని ద్విచక్ర వాహనదారులు అందోళన చెందుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

గుంతలమయంగా రోడ్డు..

ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి గుంతల మయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు , వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



గుంతల మయంగా మారిన రోడ్డుకు వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి .

- నారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్.

ఇబ్బందులు పడాల్సి వస్తుంది..



రోడ్డు గుంతల మయంగా మారడంతో వాహనదా రులకు ఇబ్బందికరంగా మారింది. వెంటనే రోడ్డును బాగు చేయాలి. రోడ్డు బాగా లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు.

- బాబు మియా (బండ)

తగ్గిన మిషన్ భగీరథ నీరు

- పూర్తిస్థాయిలో అందని నీరు
- నెలల తరబడి ఇదే పరిస్థితి



ఊట్కూర్ : ఒకపక్క వేసవికాలం మరో పక్క గ్రామానికి రావాల్సిన మిషన్ భగీరథ నీరు తగ్గిపోవటంతో గ్రామస్తులకు పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు అందక గ్రామస్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని చిన్న పొర్ల గ్రామంలో పరిస్థితి నెలకొన్నది. గ్రామంలో దాదాపు 860 కుళాయిలు ఉన్నాయి. వీటికి గాను గ్రామానికి నిత్యం మిషన్ భగీరథ పథకంలో భాగంగా మూడు లక్షల 38 వేల లీటర్ల నీరు నిత్యం సరఫరా కావలసిందిగా వీటికి గాను 1,85,000 లీటర్లు నీరు సరఫరా అవుతున్నాయని గత రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామంలో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు అందటం లేదని చెప్పొచ్చు.

వేసవిలో ఇబ్బంది..

మిషన్ భగీరథ నీరు తగ్గిపోయి సరఫరా కావటంతో మిషన్ భగీరథ నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో గ్రామపంచాయతీ ద్వారా ఉన్న ఒక్క బోరు సింగల్ ఫేస్ 5 బోర్లు ఉన్నాయి. వీటితో నీటి సరఫరా చేయటం జరుగుతుందని, దీంతో కొంతవరకు నీటి ఎద్దడిని నివారించడం జరుగుతుందని వాటర్ మ్యాన్ ఆడేం కాజీమ్ పేర్కొన్నారు . గత దాదాపు రెండు నెలల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరాలో తగ్గిపోవడంతో కొంతవరకు ఇబ్బందికరంగా మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు గ్రామానికి రావలసిన మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగడం లేదు..

మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో గ్రామానికి సరఫరా కావడం లేదు. మూడు లక్షల 38 వేల లీటర్లు నిత్యం నీరు సరఫరా కావాల్సిన ఉండగా కేవలం 1,85,000 లీటర్ల నీరు సరఫరా అవుతుంది. గ్రామంలో అడ్జస్మెంట్ చేసి నీటి సరఫరా చేసే పరిస్థితి ఏర్పడింది.

- ఆడం కాజీమ్, వాటర్ మెన్




పేట బార్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులకు సన్మానం

నారాయణపేటటౌన్ : నారాయణపేట జిల్లా కోర్టులో గురువారం జరిగిన బార్ అసోషియేషన్ ఎన్నికలలో నారాయణపేట జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా దామోదర్‌గౌడ్, కార్యదర్శిగా చెన్నారెడ్డి ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్ రామ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో.. నాయకులు





ధరూర్ : జోగులాంబ గద్వాల జిల్లా నియోజకవర్గ ధరూర్ మండల మార్లబీడు గ్రామంలో బంట్రోత్ వారి హారి వెడ్స్ శిరీష వివాహ వేడుక గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం జరిగింది.

ఈ వివాహ వేడుకకు జాతీయ కేకేసీ ధరూర్ మండల అధ్యక్షుడు సీ.రాముడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గద్వాల్ నియోజకవర్గంలోని బిజ్వారం, రాయపురం, మల్దకల్, శెట్టి ఆత్మకూరు, గట్టు,కె.టి దొడ్డి, బుర్రెడ్డి పల్లి, ఆలూరు, గద్వాలలో పలు వివాహ వేడుకల్లో గద్వాల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండ్ల రాజశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో కేకేసీ ధరూర్ మండల ఉపాధ్యక్షులు ముని రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, సత్యరెడ్డి, కురువ చిన్న కిష్టన్న, పరుశరాముడు, బీ. నర్సింహులు, కింది భాయి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు : ఎస్పీ

- తస్మాత్ జాగ్రత్త
- లోన్ ఆప్స్ అప్పు.. ప్రాణాలకు ముప్పు



నారాయణపేటటౌన్ : సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని ఎస్పీ యోగేష్ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడం జరుగుతుందని , అధిక లాభాల కోసం ఆశపడి ఆన్‌లైన్ లో పెట్టుబడి పెట్టొదని, ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో యాడ్స్ చూసి మోసపోకండి, మీరు పెట్టుబడి పెట్టండి, మీ బంధుమిత్రులతో పెట్టుబడి పెట్టించి అధిక లాభాలు పొందండి అంటూ ఆశ చూయించే చైన్ ఇన్వెస్మెంట్ మోసపూరితమైనదని గ్రహించాలని హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మవద్దని, అది సైబర్ మోసం అని గ్రహించాలని, ఆన్లైన్ లోన్స్ గురించి లోన్స్ ఆప్‌లను మీ ఫోన్ లో డౌన్లోడ్ చేసినప్పుడు మీ ఫోన్లో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లు ఫోటోలు, మీ వ్యక్తిగత వివరాలు ఆప్ వారు మీ అనుమతి లేకుండా తీసుకుంటారని పేర్కొన్నారు. తర్వాత మీరు తీసుకున్న లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో వేధింపులకు గురి చేస్తారన్నారు. తస్మాత్ జాగ్రత్త అని ఆన్లైన్ లోన్ ఆప్స్ ద్వారా లోన్స్ తీసుకోరాదని సూచించారు. లోన్ ఆప్స్ వేధింపులకు మీలో మీరే బాధపడవద్దు, క్షణికావేశాలకు పోవద్దు. మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పండి మరియు 1930 కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కస్టమర్ కేర్ నెంబర్ ను సంబంధిత వెబ్సైట్ నుండి మాత్రమే తీసుకోవాలి సైబర్ నేరగాళ్లు గూగుల్ నందు నకిలీ కస్టమర్ కేర్ నెంబర్ నుంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పండుగలకు షాపింగ్ చేసే సమయంలో ఇచ్చే లాటరీ కూపన్లలో వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని సూచించారు. లాటరీ కూపన్‌లో నమోదు చేసే ఫోన్ నెంబరు, మెయిల్ ఐడీ వంటి వ్యక్తిగత వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎవరైనా ఈ తరహా మోసాల బారినపడితే 1930 కి ఫోన్ చేయాలని అన్నారు. తెలియని నెంబర్ నుంచి వాట్సాప్ లో కానీ ఇంస్టాగ్రామ్ లో కానీ ఫేస్బుక్లో కానీ వీడియో కాల్ చేసి ఫోటో లను న్యూడ్ ఫోటో లుగా మార్ఫింగ్ చేసి మీ బంధువులకి ఫోన్ చేస్తాం ,ఫోటోలు పంపిస్తాం , యూట్యూబ్ లో అప్లోడ్ చేస్తాం అంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. పార్ట్ టైం జాబ్ ఇస్తామని, లాటరీ వచ్చింది అనో, గిఫ్ట్ వచ్చిందనో, కే వై సి అప్డేట్ చేయాలని చెప్పి సైబర్ నేరగాళ్లు పర్సనల్ డీటెయిల్స్ తీసుకొని డబ్బు కాజేస్తున్నారని పేర్కొన్నారు. ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల మోసాల్లో పడకుండా అప్రమత్తంగా ఉండడం అవశ్యకం అని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండి తోటి వారిని సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని కోరారు.

పింఛన్ మంజూరు చేయండి మహాప్రభో..!



ఊట్కూర్ : తనకు అనారోగ్యం గురై సరిగా నడవలేని పరిస్థితి మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందని తమకు దయవుంచి పింఛన్ మంజూరు చేయాలని మండలంలోని చిన్న పొర్ల గ్రామా నికి చెందిన సదర్ ఖాన్ నవీద్ మక్తల్ నియోజకవర్గం శాసన సభ్యులు వాకిటి శ్రీహరికి సంబంధిత అధికారులకు వేడుకుం టున్నాడు. గత నాలుగు సంవత్సరాల క్రితం తను అనారోగ్యానికి గురై మాటలు సరిగా రాని పరిస్థితి నెలకొందని, అలాగే సరిగా నడవలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తమకు పింఛన్ మంజూరు చేయాలని నాలుగు సంవత్సరాల నుంచి మండల పరిషత్ కార్యాలయానికి తిరుగుతున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారిందని కుటుంబానికి పెద్ద దిక్కు తానై బట్టల వ్యాపారం కుటుంబానికి నెట్టుకొని వచ్చే పరిస్థితి గతంలో ఉండేదని ప్రస్తుతం పరిస్థితి ఏమి బాగాలేదని పనిచేయాలన్న శరీరం సహకరించడం లేదన్నారు. ఎమ్మెల్యే స్పందించి తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నాడు.